# కోదాడలో 85.44% పోలింగ్

**● నియోజకవర్గవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతం**



చిలుకూరులో తొలిసారిగా ఓటు వేసిన యువతి



కోదాడ రూరల్ : కాపుగల్లు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు

కోదాడటౌన్, నవంబర్ 30 : కోదాడ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. చిన్న చిన్న ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల అధికారులు తెలిపారు. సాయంత్రం 5గంటల వరకు క్యూలైన్‌లో నిలబడ్డ వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. కోదాడలో 85.44శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల అధికారులు ఉదయం నుంచి ప్రతి 2గంటలకు ఒకసారి పోలింగ్ రిపోర్టు అందించారు. ఉదయం 9 గంటలకు 10.76 శాతం, 11 గంటలకు 21.7 శాతం, 1 గంటలకు 38.3శాతం, 3గంటలకు 59.13 శాతం కాగా సాయంత్రం 5గంటల వరకు 77.41శాతం నమోదైంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో 34మంది ఎమ్మెల్యే బరిలో నిలవగా 2,37,289 ఓటర్లకు 2,06,377(85.44శాతం) ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసులు పహారా నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని కోదాడ సహకార సంఘం చైర్మన్ ఆవుల రామారావు అన్నారు. కోదాడ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన సతీమణి విజయలక్ష్మీతో కలిసి ఓటు హక్కు వినియోగించుకుని మాట్లాడారు. ప్రజల చేతిలోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని, దీనికి ఓటే అత్యంత కీలకమని పేర్కొన్నారు. మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

# అంచనాల్లో అభ్యర్థులు

- **గెలుపుపై ఎవరికి వారు ధీమా**
- **బూత్‌ల వారీగా తమకు లభించిన ఓట్లపై ఆరా**
- **ఎవరికి వారుగా విశ్లేషణల్లో మునిగిన జనం**
- **ఆదివారం ఓట్ల లెక్కింపు.. మధ్యాహ్నానికి ఫలితాలు**

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గత ఎన్నికలతో పోలింగ్ శాతాన్ని పోల్చుతూ అందరూ అభ్యర్థులు, జిల్లా జనాలు సైతం ఫలితాలపై అంచనాల్లో మునిగిపోయారు. గత ఎన్నికల్లో మండలాలు, పోలింగ్ బూత్‌ల వారీగా ఎవరికి ఎంత మెజారిటీ వచ్చింది? ప్రస్తుతం ఆయా బూత్‌ల పరిధిలో ప్రభావం చూపగల నాయకులు ఏయే పార్టీల వైపు ఉన్నారు? జనంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎంత సానుకూలత ఉంది. ఎంత మంది ప్రజా కూటమి వైపు అనుకూలంగా ఓటేశారు? అనే అంచనాలతో లోతైన విశ్లేషణలు పలువురు చేపడుతున్నారు. ఆది నుంచీ బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు జై కొడుతున్న జిల్లా జనం.. అందుకు తగ్గట్టుగానే అనుకూలంగా ఓట్లు వేసినట్లు ఆ పార్టీ నేతలు విశ్లేషణలు చేస్తున్నారు. ఇక పోల్ మేనేజ్‌మెంట్‌లో ఎవ్వరూ సక్సెస్ అయ్యారనేది కూడా ఈ సారి కీలకంగా మారింది. నాన్ లోకల్ ఓటర్లు ఎటు మొగ్గు చూపారూ? స్థానిక ఓటర్ల పరిస్థితి ఏంటన్న కోణంలోనూ విశ్లేషణలు మొదలుపెట్టారు. ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం తమదే విజయం అంటూ దగ్గరి వాళ్లతో లెక్కలు సైతం వెల్లడిస్తున్నారు.

### హోరాహోరీగా పోరు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. గత ఎన్నికల్లో టీఆర్‌ఎస్ 9, కాంగ్రెస్ 3 స్థానాలను గెలుపొందింది. తరవాత హుజూర్‌నగర్, మునుగోడు ఉప ఎన్నికల్లో ఈ రెండు స్థానాలను కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. ఇక నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బీఆర్‌ఎస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాలు బీఆర్‌ఎస్ ఖాతాలోకి వచ్చి చేరాయి. కాగా 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఆరు స్థానాలు, కాంగ్రెస్ ఐదు, ఆ పార్టీ పొత్తులో సీపీఐ ఒక స్థానం గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ సారి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య మెజార్టీ స్థానాల్లో హోరాహోరీ పోరు కనిపించింది. దీంతో ఆయా పార్టీల నేతలు ఎవ్వరికీ వారే తమకు అనుకూలంగా లెక్కలు వేసుకుంటున్నారు. తమ తమ స్థానాల్లో తమదే విజయమంటూ సిట్టింగ్ ఎమ్మెల్యేలు.. తామే గెలుస్తున్నామంటూ వాళ్ల ప్రత్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కౌంటింగ్‌కు ఇంకా రెండు రోజుల సమ యం మిగిలి ఉన్నందున... ఇంకా పలు విశ్లేషణలకు, బెట్టింగులకు సైతం అవకాశముంది.



మునగాల : కలకోవలో ఓటు వేసేందుకు బారులుదీరిన ప్రజలు



నడిగూడెం : రామచంద్రాపురంలో ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న ఓటర్లు



కోదాడ టౌన్ : ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు



ఓటు వేసిన అనంతరం సిరా చూపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీషాలక్ష్మీనారాయణ



కోదాడలో ఓటు హక్కును వినియోగించుకున్న తల్లీకొడుకులు



మోతె : బీక్యాతండాలో ఓటు వేసేందుకు బారులుదీరిన ప్రజలు



కోదాడలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు



కోదాడలో తొలిసారి ఓటుతో ఆనందిస్తున్న యువత



చిలుకూరు : బేతవోలులో బారులు తీరిన ఓటర్లు